క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలసిన మాలమహానాడు నాయకులు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాల మహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడు రాజేష్

ఉండి: ఎస్సీ వర్గీకరణపై మాలమహానాడు నాయకులు మాజీ సీయం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసినట్లు ఆ శాఖ జిల్లా యూత్ అధ్యక్షుడు చిగురుపాటి రాజేష్ శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు.ఎస్సీ వర్గీకరణ వల్ల ఎస్సీలు పడే ఇబ్బందులు ఆయనకు వివరించారని పేర్కొన్నారు. మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డితో వర్గీకరణ అంశంపై అన్ని విషయాలు వివరించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో ఎస్సీలు పడుతున్న ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎస్సీల సమస్యలపై తాము చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని కోరామని పేర్కొన్నారు. వీటిపై జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అలాగే వైవీ సుబ్బారెడ్డి,పేర్ని నాని,అంబటి రాంబాబు,సజ్జల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజులను మర్యాపూర్వకంగా కలిసి వర్గీకరణ సమస్యలపై వివరించినట్లు రాజేష్ తెలిపారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



స్వామివారికి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆలయ చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో శ్రీమాన్ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద చార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 13న క్షీరాబ్ది ద్వాదశిన తులసీ అర్చన, 30న లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. స్వామివారికి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) దర్శించుకున్నారు.

కనులపండువగా వెంకన్నకు ఊంజల్ సేవ



స్వామివారికి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలన్లున్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో కార్తీక శనివారం పర్వదినాన్ని పురస్కరించుని ఉదయం 10 గంటలకు కొండంగి గ్రామ భక్తులతో నామసంకీర్తన(భజన) నిర్వహించారు. ఆదేవిధంగా సాయంత్రం శ్రీ స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. కార్తీకమాసం కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు జిల్లా నలుమూలల నుంచి అత్యధికంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

సబ్ స్టేషన్ వద్దే బాధితులు

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులోని ఆక్రమణ బాధితులు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కరెంటు ఆఫీసు వద్దే పడుగాపులు కాసి, నిరసన వ్యక్తంచేశారు. తమ ఇళ్లకు కరెంట్ కట్ చేయడం దారుణమని, ఇళ్లు ఖాళీ చేసేందుకు వారం రోజులు గడువు ఇచ్చి కరెంటు తీసివేయడంలో ఆంతర్యమేంటని వారు విద్యుత్ శాఖ అధికారులను నిలదీస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకూ కార్యాలంలో పడుకున్న బాధి తులు శనివారం ఉదయం నుంచిరాత్రి 7 గంటల వరకూ సబ్ స్టేషన్ వద్దే బైఠాయించారు. విద్యుత్ అధికారులు ఎవరూ కార్యాలయానికి రాకపోవడంతో వారు తిరిగి వెళ్లిపోయారు. తొలుత విద్యుత్ సీఎండీకి విద్యుత్ శాఖ అధికారులపై ఫిర్యాదు చేసినట్లు వారు విలేకర్లకు తెలిపారు. బాధితులకు అండగా సీపీఎం నాయకులు బీవీ వర్మ, సందక సూరిబాబు, తవిటినాయుడు, బి.రాంబాబు, డీ.రవితేజ తదితరులున్నారు.

మద్యం అక్రమ తరలింపుపై కేసు నమోదు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు చెప్పారు. వీరవాసరం నుంచి నవుదూరు వైపు ఆటోలో 816 మద్యం సీసాలు తరలిస్తుండగా పంజావేమవరం వద్ద జరిపిన సోదాల్లో పట్టుబడ్డాయన్నారు. ఈ కేసులో పి.వెంకన్న, కె.నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ దాడుల్లో ఎస్సైలు ఉమామహేశ్వరరావు, సునీల్ కుమార్ పాల్గొన్నట్లు సీఐ బలరామరాజు తెలిపారు.

అపార్‌తో పారదర్శకత

- వన్ నేషన్ వన్ స్టూడెంట్ పేరుతో అపార్ కార్డులు
- డేటా సేకరిస్తున్న ఉపాధ్యాయులు

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో అపార్ నమోదు కార్యక్రమం చురుకుగా సాగుతున్నది. విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలిగించే ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అపార కార్డు వల్ల విద్యార్థి దేశం లో ఎక్కడైనా చదువుకునే వీలు ఉంటుంది.అలాగే విద్యార్థికి సంబంధించిన వివరాలు అన్ని ఇందులో నిక్షిప్తమవుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆపార్ కార్డు బహుళ ప్రయోజన కార్డు అని చెప్పవచ్చు. విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది వన్ నేషన్ వన్ స్టూడెంట్ పేరుతో విశిష్ట నెంబర్‌ను కేటాయిస్తుంది. ఈ మేరకు విద్యాశాఖ పకడ్బందీగా వివరాలు సేకరిస్తోంది. పాఠశాలలు కళాశాలల్లో (ఆటోమెటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) అపార్ నమోదు చేయిస్తోంది. దీంతో దేశంలో ఎక్కడైనా పిల్లలు చదువుకొనే వెసులుబాటు కలుగుతుందని ప్రకటించింది. త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తుంది.

నియోజకవర్గంలో 34,905 మంది విద్యార్థులు

ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు మండలంలో 58 ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, ఏడు ప్రైవేట్ పాఠశాలలు, ఒక ప్రభుత్వ కళాశాల ఉండగా మొత్తం విద్యార్థులు12206 మంది ఉన్నారు. పాలకోడేరు మండలంలో ఉన్నత పాఠశాలలు 54, ప్రైవేట్ పాఠశాల 9, కళాశాలలో 2కుగాను 6434మంది విద్యార్థులు ఉన్నారు. ఉండి మండలంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 61, ప్రైవేట్ పాఠశాలలు 11గాను 6,925 మంది విద్యార్థులు ఉన్నారు. కాళ్ల మండలంలో ప్రభుత్వ ప్రాథమికఉన్నత పాఠశాలలు 55, ప్రైవేట్ పాఠశాలలు 16 గానూ 9340 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు మొత్తం 34,905 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 26135 మంది విద్యార్థులకు అపార్ నమోదు ప్రక్రియ పూర్తికాగా 8770 మందికి చేయాల్సి ఉంది. ఈ మేరకు ప్రక్రియలో ప్రధానోపాధ్యాయులు బిజీగా ఉన్నారు. సమస్త సమాచారం జాతీయ స్థాయిలో అపార్ నెంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించి కేజీ నుంచి పీజీ వరకు సమస్త సమాచారం నిక్షిప్తం చేయనున్నారు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు కళాశాలల యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులందరికి ఈ నెంబర్ కేటాయించనున్నారు. ప్రస్తుతం యూడైస్ ప్లస్ వెబ్ సైట్ లో ప్రతి విద్యార్థికి (పర్మినెంట్ ఎ డ్యూకేషన్ నంబరు) కేటాయించారు. దీని ఆధారంగా విద్యార్థులకు టీసీలు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది ఇకపై అపార్ కార్డు నెంబర్ ఉంటే దేశంలో ఎక్కడికయినా వెళ్లి చదువుకొనే అవకాశముంటుంది.

మార్పులకు నో చాన్స్

అపార్ కార్డు తీసుకునేందుకు తల్లి లేదా తండ్రి సదరు విద్యా సంస్థలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇందు కోసం యూ డైస్ ప్లస్ లో నమోదైన వివరాలు సరిచూసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీనిని ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నంబర్ జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో అపార్ కార్డు జనరేట్ చేసుకోవచ్చు. ఒకసారి వెలువడిన కార్డులో సవరణకు అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. అందువల్ల అన్ని వివరాలు ముందే సరిచూసుకోవాలని సూచిస్తున్నారు.

ఉపయోగాలెన్నో..

అపార్ కార్డుతో విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉంటాయని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అపార్ కార్డు లో విద్యార్థి పేరు పుట్టిన తేది జెండర్ క్యూ ఆర్ కోడ్ 12అంకెలతో కూడిన గుర్తింపు కార్డు నెంబర్ అన్ని కలిపి డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటుంది. విద్యార్థి చదువుకు సంబంధించిన అకడమిక్ విద్యా వివరాలు నమోదు అవుతాయి. మార్కులు గ్రేడ్లు ఉపకార వేతనాలు క్రీడల్లో సాధించిన అంశాలు అందులోని నిక్షిప్తమవుతాయి. విద్యాసంస్థల్లో ప్రవేశాలు ప్రవేశ పరీక్ష వివరాల నమోదు ధ్రువీకరణ సులభంగా ఉంటుంది. విద్యార్థుల వివరాలన్నీ డిజిటల్ లాకర ద్వారా ఆన్‌లైన్‌లో అనుసంధానమై ఉండటంతో సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడం సులువుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



వేంద్ర హైస్కూల్లో అపార్ నమోదు చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

78 శాతం పూర్తి

మండలంలో ఇప్పటి వరకు 78.92 శాతం విద్యార్థుల వివరాలు నమోదు అయ్యింది. మిగిలిన విద్యార్థుల వివరాలు కూడా సేకరించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అన్ని వివరాలు సేకరించిన తరువాత అపార్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభిస్తాం.



– ఎస్.శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంఈఓ, పాలకోడేరు

నేడు లయన్స్ జోన్ సోషల్ మీట్

ఆకివీడు: లయన్స్ క్లబ్‌ల జోన్ సోషల్ మీట్ సమావేశాన్ని ఆదివారం కైకలూరు మండలం ఆటపాక గ్రామంలో నిర్వహిస్తున్నట్లు జోన్‌చైర్మన్లు వేగేశ్న వెంకట కృష్ణంరాజు, మత్రివాడ శ్రీనివాస రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా కొల్లేరు సరస్సు తీరంలోని పక్షుల ఆవాస కేంద్రం వద్ద ప్రశాంత వాతావరణంలో సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా లయన్స్ ప్రతినిధులంతా సమావేశానికి హాజరవ్వాలని వారు కోరారు.

నేడు ఓటర్ల జాబితా సవరణకు దరఖాస్తుల స్వీకరణ

ఆకివీడు: ఓటర్ల జాబితాల్లో సవరణలకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. ఈ నెల, 10, 23,24 తేదీల్లో శని, ఆదివారాల్లో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటర్ల చేరిక, జాబితాల్లో మార్పులు, అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ సంబంధిత బూత్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు మండలంలో శనివారం 40 దరఖాస్తుల వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్ చెప్పారు. ఫామ్–6 ద్వారా కొత్త ఓటు హక్కు పొందవచ్చని, ఫామ్–7 ద్వారా అభ్యంతరాలు, ఫామ్–8 ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు చేసుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తులను తహసీల్దార్‌కార్యాలయంలో అందజేయవచ్చునన్నారు. ఆదివారం కూడా ఆయా బూత్ స్థాయిలో దరఖాస్తులను స్వీకరిస్తారని ఫరూక్ వివరించారు.

లోక్‌అదాలత్‌లతో దీర్ఘకాలిక కేసుల పరిష్కారం



సదస్సులో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్

భీమవరం అర్బన్: పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి హోహన్ (న్యూటన్) అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో డ్వాక్రా సంఘ భవనంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ న్యాయ సేవాధికార చట్టం ద్వారా మహిళలు, పిల్లలు, షెడ్యూల్ కులాలు, తెగలకు చెందినవారు, మానసిక వికలాంగులు, ప్రకృతి వైపరీత్యా బాధితులు పారిశ్రామిక కార్మికులు, సంవత్సరానికి రూ.3 లక్షలు ఆదాయం ఉన్నవారందరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులన్నారు. డిసెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం కాని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.అంబేద్కర్, ఎన్. సుధీర్, బి.సురేష్ కుమార్, ఎంబీ భవాని, కె.జ్యోతి, డి రవి కుమార్, ఏపీఎం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు భీమవరం పట్టణంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను చదువరుల సంఘం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సంయుక్త అధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. చాంబర్ అఫ్ కామర్స్ భవనంలో వారోత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించి వారు మాట్లాడారు. 14న డీఎన్నార్ కళాశాలలో వారోత్సవాలను ప్రారంభిస్తామని, 20న క్విట్ ఇండియా స్థూపం వద్ద ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కళాశాలల విద్యార్థులకు గ్రంథాలయల పట్ల అవగాహన, వివిధ పోటీలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కలిగొట్ల గోపాలశర్మ, దాయన చంద్రజీ, అల్లు రామకృష్ణ, అల్లు శ్రీనివాస్, కొండ్రు శ్రీనివాస్, పద్మ, పరిమి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాండురంగస్వామి కల్యాణ మహోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కాళ్ల: స్థానిక శ్రీ రుక్మిణీ సమేత పాండురంగస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ శాశ్వత ధర్మకర్త శ్రీ మందలపర్తి చంద్రశేఖర్, బాల దంపతుల ఆధ్వర్యంలో జరిగే ఈ కల్యాణ మహోత్సవాలు సోమవారం వినాయక పూజతో ప్రారంభంచేసి స్వామి అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెలుగా చేస్తామన్నారు. మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు వేద పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి స్వామి అమ్మవార్లకు పవళింపుసేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కల్యాణ ఉత్సవాలకు పురస్కరించుకుని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో బండారు వేణుగోపాలరావు, పెంటపాటి నాగేశ్వరరావు, బండారు సోమేశ్వరరావు, శ్రీనివాసరావు, తాతాపండు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



ఉండి: పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ మహేశ్వరరావు



పాలకోడేరు: గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రంగమ నాయుడు

ఉండి: ప్రతి ప్రభుత్వాసుపత్రిలోనూ సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు అన్నారు.శనివారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఆయన పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తల్లీబిడ్డా క్షేమంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ మహిళ గర్భం దాల్చిన రోజు నుండి ఆమెను, ఆమె గర్భంలో పెరుతున్న శిశువును జాగ్రత్తగా కాపాడాల్సిన భాధ్యత వైద్యాధికారులపైనా,సిబ్బందిపైనా ఉందని అన్నారు. ముఖ్యంగా గర్భిణుల్లో రక్తహీనత లేకుండా పరీక్షా సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పీఎంఎస్ వై(ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభయాన్) కార్యక్రమం సక్రమంగా అమలు జరిగేలా చూడాలని అన్నారు. గర్భిణులకు పీహెచ్‌సీల్లో అన్ని పరీక్షలు నిర్వహించి హైరిస్క్‌లో ఉండే వారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధనిలపాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయిచంద్ర, సీహెచ్‌ఓ కృష్ణకుమార్, హెచ్‌వీ థెరిసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

పాలకోడేరు: గర్భం దాల్చిన ప్రతి స్త్రీ తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిహెచ్ రంగం నాయుడు అన్నారు. ప్రతి నెలా 9న నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభయాన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 70 మంది గర్భిణులను పరీక్షించి రక్త పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

కేరళ వాయిద్యాలతో మార్మోగిన మావుళ్లమ్మ ఆలయం



అమ్మవారి ఆలయంలో కేరళ వాయిద్యాలు

భీమవరం (ప్రకాశంచౌక్): కేరళ వాయిద్యాలతో భీమవరం శ్రీమావుళ్లమ్మ ఆలయం శనివారం మార్మోగింది. కేరళ ఎర్నాకులంకు చెందిన శివరత్న, శివకృష్ణరాధిక, శివ రాధిక కుటుంబ సభ్యులు (రాధాకృష్ణ హోటల్ వారు) కేరళ నృత్య కళాకారుల వాయిద్య బృందంచే వాయిద్య విన్యాసం నిర్వహించారు. దాదాపు 2 గంటల పాటు ఆలయం కళాకారుల వాయిద్యాలతో మార్మోగడంతో భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం కళాకారులను, మొక్కు తీర్చుకున్న కుటుంబ సభ్యులకు ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ వేద ఆశీర్వచనాలు అందజేశారు. వీరికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు అందజేశారు.

పేదల పథకాలపై చంద్రబాబు నోరుమెదపరే?



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శేఖర్

ఉండి: అధికారం కోసం పేదలకు అది చేస్తాం ఇది చేస్తామని చెప్పి అధికారాన్ని పొందిన చంద్రబాబు ఎందుకు వాటిని అమలు చేయడం లేదని వాటిపై ఎందుకు నోరు మెదపడం లేదని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి అవుల శేఖర్, ఉపకార్యదర్శి ఆర్ వెంకట్రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఆవుల శేఖర్, ఆర్.వెంకట్రావు,బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలు కట్టే పన్నులతో నడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సంక్షేమం కోసం అసలు ఖర్చు పెట్టడం లేదన్నారు. పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని పెట్టిన చంద్రబాబు దానికి రేషన్‌కార్డు కావాలని ముడిపెట్టారన్నారు.కానీ అధికారంలోకి వచ్చి 5 నెలలు గడుస్తున్నా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా ఉచిత గ్యాస్‌కు రేషన్ కార్డు కావాలంటే పేదలు ఎక్కడి నుండి తెస్తారని ప్రశ్నించారు. అలాగే పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తానని చెప్పడంతో పేదలు నమ్మి ఓట్లు వేసారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా చేసిన వాగ్దానాలపై చంద్రబాబు ఎంతుకు నోరు మెదపడం లేదని వాటిని ఎప్పుడు అమలు చేస్తారో? చెప్పాలన్నారు.వాగ్దానాలు అమలు చేయాలంటూ ఈ నెల 18 నుంచి అన్ని గ్రామ సచివాలయ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కార్మిక సంఘం ఆందోళనలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్లు జయకృష్ణ, సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య, ఉల్లికల నాగలక్ష్మీ, లంకా సీతమ్మ, తమ్మనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితానికి మూలం స్త్రీ



చిలుకూరులో నిర్వహించిన స్త్రీల ర్యాలీలో పాల్గొన్న స్త్రీల సమాజ ప్రతినిధులు

ఉండి: సమాజానికి హితానికి స్త్రీ మూలమని ఉండి ఎన్నార్పీ అగ్రహారం పేరిష్ స్త్రీల చైర్మన్ సిస్టర్ డి.ప్రణీత మేషక్ అన్నారు. శనివారం ఉండి మండలం చిలుకూరు సెయింట్ థోమా లూథరన్ చర్చ్‌లో 10 గ్రామాల పరిధిలో క్రైస్తవ ఆధ్యాత్మిక పేరిష్ స్త్రీల ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేరిష్ పాస్టర్ రెవరెండ్ డీ మేషక్ సతీష్‌కుమార్, అడిషినల్ పాస్టర్ అబ్షాలోమ్‌రాజు ప్రార్థనా,ఆరాధనలతో స్త్రీల ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రెవరెండ్ ఎస్ సుజాత అశోక్ మాట్లాడుతూ క్రీస్తు ఉపదేశాలపై సందేశమిచ్చారు.సమాజంలోను,కుటుంబంలోను స్త్రీ ప్రముఖపాత్ర వహించాలన్నారు.ఎక్కడైతే స్త్రీ గౌరవింపబడుతుందో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.స్త్రీల పట్ల ఏవిధంగా గౌరవంగా,మర్యాదగా నడుచుకోవాలో తమ బిడ్డలకు ప్రతీ తల్లిదండ్రీ నేర్పించాలన్నారు.అలాగే ప్రతీ స్త్రీమూర్తి తన కుటుంబం పట్ల అంకితభావంతో పనిచేయాలన్నారు.కుటుంబం ఆధ్యాత్మికంగా అభివృద్ధితో పాటు కుటుంబికులంతా మంచి వాతావరణంలో పెరిగేలా చక్కని భాధ్యతతో వ్యవహరించాలన్నారు.అలాగే స్త్రీ కూడా అన్ని రంగాల్లోను ముందుండాలని అన్నారు.స్త్రీ స్వేచ్ఛగా జీవించాలంటే ముందుగా తాను బాగా చదవుకుని మంచి ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు.ఆర్థికంగాను అభివృద్ధి చెందాలన్నారు.అలాగే ఆధ్యాత్మికంగా క్రీస్తు ఉపదేశాలను మరింతగా తెలుసుకోవాలన్నారు. దేవుని మాట వింటేనే మనం,మన కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కుటుంబంలో స్త్రీలు అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగితే ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో స్త్రీల సమాజ అధ్యక్షురాలు ఇజ్జిని సువార్త, ఉట్ల కేథరీన్, సంఘ సీఆర్ గాబ్రియేల్, చిలుకూరు, ఎన్నార్పీ అగ్రహారం,వాంద్రం, వాండ్రంలంక, మమదేవపట్నం, వెలివర్రు, శేరేగూడెం, పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు గ్రామాలకు చెందిన స్త్రీల సమాజ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.